సాక్షి నిజామాబాద్

సోమవారం । 5 । జూన్ । 2023



మద్యం తాగి వేధిస్తున్నాడని..

నిత్యం మద్యం తాగి వేధిస్తున్నాడని భర్తను భార్య హత్య చేసింది. ఈ ఘటన మోపాల్ మండలం న్యాల్‌కల్‌లో జరిగింది.

- 8లో ▸



మినరల్ కాదు..

జిల్లాలోని అనేక వాటర్ ప్లాంట్లలో నిర్వాహకులు కెమికల్ కలిపిన వాటర్ విక్రయిస్తూ, సొమ్ము చేసుకుంటున్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 42.7 /30.3

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. గాలులు వీస్తాయి. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశ ఉంది.

న్యూస్‌రీల్

సిద్ధాపూర్ రిజర్వాయర్‌తో 14వేల ఎకరాలకు సాగు నీరు

- అసెంబ్లీ స్పీకర్ పోచారం



వర్ని: సిద్ధాపూర్ రిజర్వాయర్ నిర్మాణంతో 14వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పనులు వేగవంతంగా పూర్తిచేసి పంట పొలాలకు నీళ్లందిస్తామని పేర్కొన్నారు. వర్ని మండలంలో నూతనంగా నిర్మిస్తున్న సిద్ధాపూర్ రిజర్వాయర్ నిర్మాణ పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. సిద్ధాపూర్ రిజర్వాయర్ నిర్మాణ పనులు షెడ్యూల్ ప్రకారం జరుగుతున్నాయన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్యాకేజీ 22లో భాగమే ఈ రిజర్వాయర్ అని పేర్కొన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 7న నిర్వహించే సాగునీటి దినోత్సవాన్ని సిద్ధాపూర్ రిజర్వాయర్ వద్ద ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఆయన వెంట స్థానిక ప్రజాప్రతినిధులు, ఇరిగేషన్‌శాఖా అధికారులు ఉన్నారు.

కమ్మర్‌పల్లికి విద్యుత్ కాంతులు

- నేడు ప్రారంభించనున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని రహదారి విద్యుత్ కాంతులతో జిగేల్‌మని మెరవనుంది. ఎనిమిది నెలల క్రితం రూ. 5 కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభించిన రోడ్డు విస్తరణ, డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తయ్యాయి. రహదారిని 8.75 మీటర్ల చొప్పున ఇరువైపులా 1.2 కిలోమీటరు వరకు వెడల్పు చేశారు. 5 ఫీట్ల వెడల్పుతో డివైడర్ నిర్మాణం చేపట్టారు. డివైడర్ మధ్యలో ఆహ్లాదాన్ని పంచే మొక్కలను నాటారు. విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి ఎల్‌ఈడీ లైట్లు అమర్చారు. సోమవారం రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సెంట్రల్ లైటింగ్‌ను స్విచ్ ఆన్ చేసి ప్రారంభించనున్నారు.

హిందూ సమాజాన్ని కాపాడుకోవాలి



సుభాష్‌నగర్: హిందూ సమాజాన్ని, సమాజంలోని బాలికలు, ఆడపడుచులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్క హిందువుపై ఉందని ఆర్‌ఎస్‌ఎస్ తెలంగాణ ప్రాంత సహ సేవా ప్రముఖ్ బలవత్రి గణేశ్‌జీ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని అక్షర్ ధాం స్కూల్‌లో హిందూ సామ్రాజ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా బలవత్రి గణేశ్‌జీ మాట్లాడుతూ హిందూ సమాజం సంఘటితంగా ఉంటే విశ్వమే సంక్షేమంతో విరాజిల్లుతుందని పేర్కొన్నారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ రాజు మాత్రమే కాదని, పరిపూర్ణమైన ఆర్థిక ప్రణాళిక కను కలిగిన గొప్ప ఆర్థిక వేత్త అని అన్నారు. శివాజీ మహారాజ్ సామర్థ్యం, ధైర్యం, వీరత్వం నేటి తరానికి తప్పనిసరిగా అందించాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవాహ డాక్టర్ దస్తగిరి, నగర కార్యవాహ గంగానర్సయ్య, దత్తు పాల్గొన్నారు.


మావోయిస్ట్ నేత సుదర్శన్‌కు జిల్లాతో సంబంధాలు!

సాక్షి, కామారెడ్డి : గుండెపోటుతో ఇటీవల మరణించిన మావోయిస్ట్ పార్టీ అగ్రనేత కటకం సుదర్శన్ అలియాస్ ఆనంద్‌కు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా విప్లవోద్యమంతో అనుబంధం ఉంది. ఉత్తర తెలంగాణ స్పెషల్ జోన్ కమిటీ కార్యదర్శి హోదాలో ఆయన జిల్లాలో పలుమార్లు పర్యటించారు. ఉమ్మడి నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల సరిహద్దు ప్రాంతంలో ఆయన అప్పటి పీపుల్స్ వార్ కార్యకలాపాలపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో పాతతరం సానుభూతిపరులు, మాజీలకు ఆయనతో మాట్లాడిన సందర్భాలు చాలానే ఉన్నాయి. 1996లో పీపుల్స్ వార్ పార్టీ తెలంగాణ కోసం చేసిన తీర్మానాలు, ఉద్యమ నిర్మాణంలో ఆయన పాత్ర ఎంతో ఉందని చెబుతున్నారు. దాదాపు 48 ఏళ్లుగా అజ్ఞాతంలో ఉన్న ఆనంద్ ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో పార్టీ సమావేశాల్లో కూడా పాల్గొన్నట్లు తెలుస్తోంది.

పొరుగు మద్యం ప్రవాహం!

- జిల్లాలోకి మహారాష్ట్ర, గోవా లిక్కర్
- సరిహద్దు దాటుతున్న అక్రమ మద్యం
- ప్రైవేటు వాహనాల్లో సప్లయ్
- చెక్‌పోస్టుల వద్ద నామమాత్రపు తనిఖీలు
- జిల్లాలో విచ్చలవిడిగా అమ్మకాలు

పొరుగు రాష్ట్రాల నుంచి అక్రమ మార్గాల ద్వారా మద్యం జిల్లాకు తరలివస్తోంది. మద్యం మాఫియా అక్రమ మార్గాలను ఎంచుకుని పెద్ద ఎత్తున మద్యాన్ని తీసుకువచ్చి దందా నడిపిస్తోంది. జిల్లాకు పొరుగున ఉన్న మహారాష్ట్రతో పాటు గోవా నుంచి మద్యం తెచ్చి ఇక్కడ విక్రయిస్తున్నారు. చాలాచోట్ల బెల్ట్ షాపుల్లో పొరుగు రాష్ట్రాల మద్యం విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది.



ఖలీల్‌వాడి: జిల్లాలో పొరుగు రాష్ట్రాల మద్యం పొంగుతోంది. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు అక్రమంగా మద్యం పెద్ద ఎత్తున తరలివస్తోంది. జిల్లా సరిహద్దు ప్రాంతంలో ఉన్న మహారాష్ట్రతో పాటు గోవా నుంచి మద్యం పెద్దఎత్తున తరలివస్తున్నట్లు తెలుస్తోంది. ప్రతిరోజూ వాహనాలలో అక్రమ రవాణా జరుగుతోంది. జిల్లా సరిహద్దులో బోర్డర్ చెక్ పోస్టులు ఉన్నా అవి నామమాత్రంగానే పని చేస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. చెక్ పోస్టుల వద్ద అక్రమ రవాణాను అరికట్టాల్సి ఉండగా కొందరు అధికారులు మామూళ్లు తీసుకుంటూ అక్రమ దందాకు సహకరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అంతేగాక దేశీదారు మద్యం అమ్మకాలు కూడా సాగుతున్నట్లు తెలుస్తోంది.

బోర్డర్‌లో చెక్‌పోస్టులు ఉన్నా..

అక్రమార్కులు లిక్కర్‌ను గోవా నుంచి మహారాష్ట్ర రాజధాని ముంబయికి తరలిస్తున్నారు. అక్కడి నుంచి సముద్రం ద్వారా గాని, రోడ్డు మార్గంలో వాహనాల ద్వారా లిక్కర్‌ను పంపిస్తారు. మహారాష్ట్ర, తెలంగాణ చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నామమాత్రంగా ఉంటుండడంతో ఇక్కడకు తరలించడం సులువుగా మారింది. ఒకవేళ చెక్ పోస్టు వద్ద తనిఖీలు జరిగితే మద్యాన్ని మహారాష్ట్ర ప్రాంతంలోని గ్రామాల గుండా జిల్లాలోకి తీసుకువస్తారు. ఇక్కడ విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. అంతేకాకుండా ఇందులో ఏడాది నుంచి పదేళ్ల పాటు నిల్వ చేసిన మద్యాన్ని వ్యాపారులు అమ్మకాలు సాగిస్తున్నారు. ఏడాది నిల్వ ఉన్న మందుకు రూ. 500 ఎక్కువగా తీసుకుంటారు. ఐదేళ్ల పాటు నిల్వ ఉన్న మందుకు రూ. 2వేల వరకు ఎక్కువగా తీసుకుంటున్నారు. దీంతో ఎక్కువ కాలం నిల్వ ఉన్న మందుకు గిరాకీ పెరగడంతో నగరంలో వీటి అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. నిజామాబాద్, నిర్మల్, జగిత్యాల్, కామారెడ్డి జిల్లాలకు ఇక్కడి నుంచి మద్యం వెళ్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదనే ఆరోపణలున్నాయి.

లిక్కర్‌పై నిషేధం ఉన్నా..

కేంద్ర పాలిత ప్రాంతమైన గోవాకు విదేశీయులతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన వారు టూరిస్టులుగా వెళ్తారు. టూరిస్టులను ఆకర్షించేందుకు గోవాలో లిక్కర్‌పై పన్ను తక్కువగా వసూలు చేస్తుండడంతో బీర్లు, వీస్కీ, బ్రాందీ తక్కువ ధరలకే లభిస్తాయి. దీనిని క్యాష్ చేసుకునేందుకు జిల్లాలకు చెందిన వ్యాపారులు మహారాష్ట్ర గుండా లిక్కర్‌ను జిల్లాకు తరలిస్తున్నారు. ఈ లిక్కర్‌ను ఇతర రాష్ట్రాలకు తరలించడంపై నిషేధం ఉన్నా.. వాహనాల్లో అక్రమంగా జిల్లాకు తీసుకువస్తున్నారు. అంతేకాకుండా మహారాష్ట్ర నుంచి దేశీదారు, ఇతర లిక్కర్ తక్కువ ధరకు దొరకడం ద్వారా సరిహద్దు గ్రామాలకు చెందిన వారు మహారాష్ట్ర నుంచి లిక్కర్‌ను తీసుకువచ్చి ఇక్కడ విక్రయిస్తున్నారు.

ఇటీవల పట్టుబడ్డ మద్యం

ఇటీవల మహారాష్ట్ర నుంచి అక్రమ మద్యం తరలించడంపై ఎక్సైజ్ అధికారులు 190 లీటర్ల మద్యాన్ని పట్టుకొని కేసులు నమోదు చేశారు. రెండు రోజుల క్రితం ఆటోలో దేశీదారు తరలిస్తున్న డ్రైవర్‌తో పాటు ఆటోను టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బోధన్, బాన్సువాడ నియోజకవర్గంలోని మండలాల్లో ఎక్సైజ్ అధికారులు అవగాహన కార్యక్రమాలు చేపట్టారు.

రెండు బృందాలతో తనిఖీలు

జిల్లాకు మహారాష్ట్ర 40 కిలోమీటర్ల సరిహద్దు ఉంది. జిల్లాలో చీప్‌లిక్కర్‌కు ధర ఎక్కువగా ఉండడంతో మహారాష్ట్ర దేశీదారుకు ధర తక్కువ ఉండడంతో వాటిని సరిహద్దు మద్యం ప్రియులు తీసుకుంటున్నారు. రెండు బృందాలు ఏర్పాటు చేసి తనిఖీలు చేస్తున్నాం. గోవా మద్యంపై ప్రత్యేక దృష్టి సారించాం. ఎన్నికలు వస్తున్నందున మద్యం అక్రమ రవాణాను అరికడతాం.

– మల్లారెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్, నిజామాబాద్

వేల్పూర్‌లో రోడ్డుపై విరిగిపడిన చెట్టు



జిల్లా వ్యాప్తంగా భారీ వర్షం

సుభాష్‌నగర్: జిల్లా వ్యాప్తంగా ఆదివారం సాయంత్రం ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. నగరంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లపై వర్షపు నీరు ప్రవహిస్తోంది. భారీ గాలులకు పలుచోట్ల చెట్ల కొమ్మలు విరగగా, విద్యుత్ అంతరాయం ఏర్పడింది. నగరంతోపాటు మోపాల్, డిచ్‌పల్లి, ఇందల్వాయి, సిరికొండ, బోధన్, వేల్పూర్, మోర్తాడ్, వర్ని, రుద్రూర్, ఆర్మూర్, తదితర మండలాల్లో వర్షం కురిసింది. జిల్లాలో 95శాతం ధాన్యం సేకరణ పూర్తయ్యింది. అక్కడక్కడ మిగిలిపోయిన ధాన్యం రాశులు, బస్తాలు అకాల వర్షానికి తడిసాయి. ఈదురుగాలులకు తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలు, హోర్డింగులు నేలకూలాయి.

మోపాల్ మండలంలోని న్యాల్‌కల్ గ్రామంలో ఆదివారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి తూకం వేసిన ధాన్యం బస్తాలు పూర్తిగా తడిసిపోయాయి. గ్రామంలో సుమారు 4వేల బస్తాలు తూకం వేసినట్లు తెలిసింది. తడిసిన బస్తాలను వీలైనంత త్వరగా రైస్‌మిల్లులకు తరలించాలని రైతులు కోరుతున్నారు.



నగర శివారులో బోర్గాం(పి) వద్ద గాలులకు నేలకూలిన హోర్డింగ్



వర్షానికి న్యాల్‌కల్‌లో తడిసిపోయిన ధాన్యం బస్తాలు

మంచిప్ప రీడిజైన్‌ను రద్దు చేయాలి

- బీఆర్‌ఎస్‌ను గద్దె దించే సమయం ఆసన్నమైంది
- నిర్వాసితుల కోసం జైలుకెళ్లడానికైనా సిద్ధం
- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్



కొండెం చెరువును పరిశీలిస్తున్న ప్రవీణ్‌కుమార్

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మంచిప్ప ప్రాజెక్ట్ రీడిజైన్ వల్ల వేల గిరిజన కుటుంబాలు నిర్వాసితులుగా మారుతున్నాయని, తక్షణమే రీడిజైన్ రద్దు చేసి, పాత డిజైన్ ప్రకారం ప్రాజెక్ట్ పనులు చేపట్టాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. మంచిప్ప రిజర్వాయర్ ముంపు గ్రామాల నిర్వాసితుల కమిటీ చేపడుతున్న ఉద్యమానికి ఆయన మద్దతు పలికారు. ఈ సందర్భంగా మంచిప్ప కొండెం చెరువును పరిశీలించారు. అంతకుముందు ఆయన మాట్లాడుతూ మంచిప్ప రిజర్వాయర్ వల్ల 8 తండాలు, 2 గ్రామ పంచాయతీలు పూర్తిగా ముంపునకు గురవుతున్నాయని తెలిపారు. ప్రాజెక్టు రీడిజైన్ వల్ల 4వేల కుటుంబాలు రోడ్డు పడుతున్నాయని, ఆయకట్టు పెరగకుండా రూ. 2,500 కోట్లకుపైనే అంచనా వ్యయాన్ని పెంచారని ఆరోపించారు. పెంచిన వ్యయం ఎవరి జేబుల్లోకి వెళ్లిందని ప్రశ్నించారు. కేవలం కాంట్రాక్టర్ల లబ్ధి, కమీషన్ల కోసమే రీ డిజైన్ చేశారన్నారు.

హత్యాయత్నం కేసులు దుర్మార్గం

భూములు కోల్పోయిన రైతులు నిరసన తెలిపితే హత్యాయత్నం కేసులు పెట్టి జైలుకు పంపడం దుర్మార్గమన్నారు. కేసీఆర్‌కున్న 300 ఎకరాల ఫామ్ హౌస్‌ను కూడా ప్రాజెక్టుల పేరుతో గుంజుకుంటే ఊరుకుంటారా? అని ప్రశ్నించారు. నిర్వాసితులపై పెట్టిన అక్రమ కేసులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అవసరమైతే రైతులతో కలిసి జైలుకు వెళ్లేందుకు సిద్ధమని ప్రకటించారు. సీఎం మెడలు వంచే వరకూ బీఎస్పీ నిర్వాసితుల పక్షాన పోరాడుతుందని, బీఆర్‌ఎస్‌ను గద్దె దించే సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు నర్సయ్య, గంగాధర్, కళా శ్రీనివాస్, నీరడి లక్ష్మణ్, గణేష్, ముంపు కమిటీ ప్రతినిధులు శంకర్ నాయక్, ఈశ్వర్ సింగ్ పాల్గొన్నారు.

ఏళ్లుగా ఎదురుచూపులే..!

- వ్యవసాయశాఖలో కలగానే బదిలీలు, పదోన్నతులు
- సంవత్సరాల తరబడి ఒకేచోట పనిచేస్తున్న ఉద్యోగులు
- ప్రభుత్వానికి విన్నవిస్తున్నా పట్టించుకోని వైనం



డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లా వ్యవసాయ శాఖలో ఉద్యోగ బదిలీలు, పదోన్నతులు కలగా మారాయి. స్థాన చలనం లేక ఏళ్ల తరబడి ఒకేచోట పనిచేస్తూ ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వానికి, ఉన్నతాధికారులకు ఎన్నిమార్లు విన్నవించినా ప్రయోజనం లేకపోవడంతో తీవ్ర నిరాశలో ఉన్నారు. తమకు స్థానచలనం కల్పించి దూరభారం ఇబ్బందులను తప్పించాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. వ్యవసాయ శాఖ పరిధిలో మండల వ్యవసాయాధికారులు 30 మంది, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు 106 మంది, అలాగే సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు కలిపి 35 మంది వరకు పనిచేస్తున్నారు. అటెండర్లు కూడా పదుల సంఖ్యలో ఉన్నారు. ప్రభుత్వం వీరికి బదిలీలు చేపట్టకపోవడంతో ఒకేచోట ఎక్కువ కాలం విధులు నిర్వర్తిస్తున్నారు. ఇది నిబంధనలకు వ్యతిరేకమైనప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కాగా, ప్రభుత్వం బదిలీలు చేపట్టకపోవడంతో కొంతమంది ఉద్యోగులకు కలిసొచ్చిందనే ఆరోపణలున్నాయి. మండల స్థాయి అధికారులు తమ స్థానాల నుంచి కదలడానికి ఇష్టపడడం లేదని తెలుస్తోంది.

ఒక్కొక్కరు పదేళ్లకు పైగా ఉంటూ కుర్చీలను వీడడం లేదు. ఇలాంటి అధికారుల కారణంగా బదిలీలు కోరుకునే ఇతర ఉద్యోగులకు స్థానచలనం కలగడం లేదు. నిత్యం దూర ప్రాంతాలకు ప్రయాణం చేసి విధులు నిర్వర్తించడం, లేదంటే ఇల్లు అద్దెకు తీసుకుని కుటుంబంతో సహా పనిచేసే ప్రాంతంలో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని పలువురు ఉద్యోగులు వాపోతున్నారు.

పదోన్నతులకూ..

వ్యవసాయ శాఖలో ఉద్యోగ బదిలీలు లేవనుకుంటే, పదోన్నతులు కూడా కరువయ్యాయి. ఎంఏవోలు, ఏఈవోలు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లకు కొన్నేళ్లుగా పదోన్నతులు లేవు. ప్రభుత్వం పదోన్నతులు కల్పిస్తే బదిలీలకు అవకాశం ఏర్పడుతుందని ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. కొందరైతే ఏకంగా 15ఏళ్లుగా పనిచేస్తున్నా వారికి ప్రమోషన్లు రాక నిరాశతో ఉన్నారు. అదే రెవెన్యూ శాఖలో అయితే, మాకు రెండుసార్లు పదోన్నతులు వచ్చేవని వాపోతున్నారు. ప్రభుత్వం ఇకనైనా బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను చేపట్టాలని కోరుతున్నారు.

ఆదేశాలు వస్తేనే..

వ్యవసాయ శాఖలో ఉద్యోగుల బదిలీలు, పదోన్నతుల విషయంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. క్షేత్రస్థాయిలో పనిచేసే వ్యవసాయాధికారుల వినతులను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు పంపుతున్నాం. ఆదేశాలు వచ్చిన వెంటనే క్యాడర్ వారీగా బదిలీలు, పదోన్నతులకు ప్రక్రియను మొదలు పెడతాం.

– ఆర్.తిరుమల ప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి

పోలీసులతోనే శాంతిభద్రతల పరిరక్షణ

- సురక్షా దినోత్సవంలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
- పోలీసు వాహనాలతో భారీ ర్యాలీ
- ఆకట్టుకున్న ఓపెన్ హౌస్ కార్యక్రమం



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు



నగరంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

ఖలీల్‌వాడి: శాంతి భద్రతల పరిరక్షణ పోలీసులతోనే సాధ్యమవుతుందని, తెలంగాణ పోలీసులు దేశంలోనే నెంబర్ వన్‌గా నిలుస్తున్నారని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో సురక్షా దినోత్సవం నిర్వహించారు. అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా అధ్యక్షత వహించగా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నేరాల నియంత్రణ, మెరుగైన పోలీసింగ్ కోసం పెట్రో కార్స్, బ్లూ కోల్ట్స్ వాహనాలను రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చిందన్నారు. ఏ ప్రాంతమైనా అభివృద్ధి చెందాలంటే శాంతిభద్రతలు నెలకొని ఉండాలన్నారు. తెలంగాణ పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని నేరాల నియంత్రణకు పోలీసులు కృషి చేస్తున్నారని తెలిపారు. పెట్రో కార్స్, బ్లూ కోల్ట్స్, జిల్లా స్థాయిలోనూ కమాండ్ కంట్రోల్ స్టేషన్స్, షీ టీమ్స్, భరోసా సెంటర్స్ వంటివి గంటలు శాంతిభద్రతల పరిరక్షణకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఓపెన్ హౌస్ కార్యక్రమం అందరినీ ఆకర్షించింది.

నగరంలో బైక్ ర్యాలీ

పోలీస్ సిబ్బంది నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ ఇతర అతిథులు జెండా ఊపి హెడ్ క్వార్టర్స్ నుంచి ఈ ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, మేయర్ నీతూ కిరణ్, అదనపు డీసీపీ మధుసూదన్ రావు, నుడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, నిజామాబాద్ ఏసీపీ కిరణ్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మోదీ హయాంలోనే సంక్షేమం, అభివృద్ధి

- తొమ్మిదేళ్లలో అవినీతి లేని పాలన
- సీఎం కేసీఆర్ ప్రాజెక్టుల పేరిట దోపిడీ
- ఎంపీ ధర్మపురి అర్వింద్



మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

ఖలీల్‌వాడి: ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో పేదలకు సంక్షేమం, అభివృద్ధి సాధ్యమైందని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో జన్ సంపర్క్ అభియాన్‌పై ఆదివారం ప్రెస్‌మీట్ నిర్వహించారు. ముందుగా ఒడిశాలోని బాలాసోర్ జిల్లాలో జరిగిన రైలు ప్రమాదంలో మృతులకు నివాళులర్పిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం సేవా, సేశన, గరీబ్‌కళ్యాణ్ యోజనపై ఫోకస్ చేసినట్లు తెలిపారు. మోదీ తొమ్మిదేళ్ల పాలనలో అవినీతి లేదన్నారు. సీఎం కేసీఆర్ కుటుంబం రాష్ట్రంలో అవినీతి అక్రమాలకు పాల్పడిందన్నారు. ప్రధాని ఆవాస్ యోజన కింద దేశంలో 3.50లక్షల మందికి ఇళ్ల నిర్మాణం చేసినట్లు చెప్పారు. సీఎం కేసీఆర్ ఎన్నికలకు ముందు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని ప్రకటించినా ఇంత వరకు ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్‌హయంలో గ్రామీణప్రాంతంలో 39 శాతం మరుగుదొడ్లు నిర్మిస్తే ప్రధాని హయాంలో వందశాతం పూర్తి చేసినట్లు చెప్పారు. కాళేశ్వరం, భగీరథ పథకాల్లో కేసీఆర్ అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ఉజ్వల యోజన కింద 9.6 కోట్ల సిలిండర్లు ఇచ్చినట్లు తెలిపారు. ఆయుష్మాన్‌భారత్ ద్వారా రూ. 5 లక్షల ఇస్తుందని, ఇందులో అత్యధికంగా ముస్లింలు బెనిఫిట్ పొందుతున్నారని చెప్పారు. కేసీఆర్ అసెంబ్లీలో ఈ పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు చెప్పి ఇంత వరకు ప్రారంభించలేదన్నారు. పీఎం కిసాన్ సంయోజన పథకం కింద ప్రతియేటా రైతులకు రూ. 6వేలు చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా ఎరువులు, ఇతర సబ్సిడీల రూపంలో ఎకరానికి రూ. 34వేలు అందిస్తున్నట్లు చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వం రూ. 10 వేలు ఇచ్చి అన్ని సబ్సిడీలను ఎత్తివేసిందన్నారు. విద్యారంగంలో మోదీ ప్రభుత్వం నూతన విద్యా విధానం అమలు చేస్తుందన్నారు. జిల్లా కేంద్రంలోని నాగారాం స్టేడియం అభివృద్ధికి కేంద్రం నిధులు కేటాయిస్తే రాష్ట్ర ప్రభుత్వం నుంచి మంత్రి ప్రశాంత్‌రెడ్డి నిధులు తీసుకురావడం లేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు ధన్‌పాల్ సూర్యనారాయణ, డాక్టర్ మల్లిఖార్జున్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, పల్లె గంగారెడ్డి, న్యాలంరాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బ్యాడ్మింటన్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని మోపాల్‌లోగల ఫిట్‌నెస్ బ్యాడ్మింటన్ క్లబ్‌లో ఆదివారం జిల్లా బ్యాడ్మింటర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. అండర్ 17, 19, 21 సంవత్సరాలపైబడిన బాలబాలికలకు పోటీలు నిర్వహించి విజేతలను రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలకు పంపిస్తున్నామని అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కర్నాటీ వాసు, కేవీ కిరణ్‌కుమార్ తెలిపారు. సింగిల్స్, డబుల్స్‌లో విజేతలను ఎంపిక చేశామని, త్వరలోనే రాష్ట్రస్థాయి పోటీలు ఉంటాయన్నారు. అధిక సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారని, పోటీలకు వేదికను అందించిన ఫిట్‌నెస్ బ్యాడ్మింటన్ క్లబ్ యాజమాన్యానికి వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

నేడు విద్యుత్ విజయోత్సవ సభలు

నిజామాబాద్‌నాగారం: తెలంగాణ అవతరణ దినోత్సవ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా సోమవారం విద్యుత్ విజయోత్సవ సభలు నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. శాసనసభా నియోజకవర్గాల వారీగా సమావేశాలను నిర్వహించనున్నారు. ప్రతి గ్రామం నుంచి రైతులు, వివిధ వర్గాల ప్రజలను సమీకరించేలా చర్యలు తీసుకున్నారు. బాల్కొండ నియోజకవర్గంలోని మోర్తాడ్-కమ్మర్‌పల్లి మార్గంలో గల లలితా గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో జరిగే సభకు రాష్ట్ర రోడ్లు,భవనాల శాఖా మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి విచ్చేయనున్నారు. మిగతా నియోజకవర్గ కేంద్రాల్లోనూ ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొననున్నారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు రాష్ట్రంలో విద్యుత్ రంగంలో నెలకొని ఉన్న పరిస్థితులు, స్వరాష్ట్రంలో సాధించిన విద్యుత్ విజయాల గురించి వివరించనున్నారు. ముఖ్యంగా వ్యవసాయమే ప్రధాన ఆధారంగా ఉన్న నిజామాబాద్ జిల్లాలో సాగు రంగానికి ఉచిత విద్యుత్ రూపేణా చేకూరుస్తున్న లబ్ధి గురించి, నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు నూతనంగా నెలకొల్పిన సబ్ స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఎస్సీ, ఎస్టీలు, నాయీబ్రాహ్మణులు తదితర వర్గాల వారికి అందిస్తున్న ఉచిత కరెంటు, పారిశ్రామిక రంగానికి రాయితీలు తదితర విషయాల గురించి ప్రజలకు వివరించనున్నారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సభలను విజయవంతం చేసేందుకు విస్తృత స్థాయిలో అధికారులు ఏర్పాట్లు చేశారు.

బెటాలియన్ పోలీసుల బైక్ ర్యాలీ



డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా టీఎస్ఎస్పీ ఏడో బెటాలియన్, డిచ్‌పల్లి పోలీసులు ఆదివారం సురక్షా దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కమాండెంట్ ఎస్వీ సత్య శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బెటాలియన్ నుంచి నిజామాబాద్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బెటాలియన్‌లో ఓపెన్ హౌజ్ నిర్వహించారు. డిచ్‌పల్లి గ్రామ విద్యార్థులు, యువకులకు వివిధ రకాల ఆయుధాలపై స్వయంగా కమాండెంట్ అవగాహన కల్పించారు.



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆర్మూర్ జెడ్పీహెచ్ఎస్ 2002-03 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు



మోస్రా జెడ్పీహెచ్ఎస్ 1997-98 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు

ఆర్మూర్‌టౌన్/రుద్రూర్/కమ్మర్‌పల్లి/మద్నూర్/కామారెడ్డి టౌన్/కామారెడ్డి అర్బన్/రాజంపేట: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళన కార్యాక్రమాలు నిర్వహించారు. అర్మూర్‌లోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్పీహెచ్ఎస్)లో 2002- 2003 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు ఆర్మూర్‌లోని వేంకటేశ్వర కల్యాణ మండపంలో ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం జరుపుకున్నారు. అలాగే మోస్రా జెడ్పీహెచ్ఎస్ 1997-98 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు, కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్ జెడ్పీహెచ్‌లో 1996-97 ఎస్సెస్సీ బ్యాచ్, మద్నూర్ జెడ్పీహెచ్ఎస్ 1997-98 ఎస్సెస్సీ బ్యాచ్, రాజంపేట బాలుర ఉన్నత పాఠశాలలోని 1994-95 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు కూడా ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. అలాగే కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని 1995-98బ్యాచ్ డిగ్రీ బీకాం విద్యార్థులు సైతం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా వారు చాలా ఏళ్ల తర్వాత కలుసుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఆనాడు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.



ఉప్లూర్ జెడ్పీహెచ్ఎస్ 1996-97 ఎస్సెస్సీ బ్యాచ్



మద్నూర్ జెడ్పీహెచ్ఎస్ 1997-98 ఎస్సెస్సీ బ్యాచ్



రాజంపేట బాలుర ఉన్నత పాఠశాల 1994-95 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు



కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల 1995-98బ్యాచ్ డిగ్రీ బీకాం విద్యార్థులు

వడ్ల పైసలు వస్తలేవు

- కోత యంత్రాలకు అద్దె చెల్లించలేని పరిస్థితి
- వానాకాలం సాగు పెట్టుబడి కోసం రైతుల ఆందోళన

భిక్కనూరు: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతులు డబ్బుల కోసం ఎదురు చూస్తున్నారు. ధాన్యం అమ్మి 20 రోజులు దాటినా డబ్బులు ఇంకా రైతు ఖాతాల్లో జమ కాలేదు. కాంటా వేసిన వెంటనే నిధులు జమ చేస్తామని ప్రజాప్రతినిధులు చెబుతున్నా ఎక్కడా అమలు కావడం లేదు. యాసంగిలో పండించిన ధాన్యం డబ్బులు ఇంక రాకపోవడంతో కోత యంత్రాలకు ఇంకా అద్దె చెల్లించలేక పోతున్నామని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా వానాకాలం సీజన్ మొదలు కావడంతో డబ్బులు చేతిలో లేక దుక్కులు ఎలా దున్నాలని, విత్తనాలు ఎట్లా కొనుగోలు చేయాలని రైతులు ఆందోళన చెందుతున్నారు. సన్న రకం వరి సాగుచేసే రైతులు ప్రతి ఏటా మృగశిర కార్తె కంటే ముందే విత్తనాలను కొనుగోలు చేసి విత్తుతారు. జూన్ 8న మృగశిర కార్తె ఉందని ఇప్పటి వరకు డబ్బులు రాలేదని అన్నదాతలు ఆగం అవుతున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 58,968 మంది రైతుల నుంచి 3.23 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఇందుకు సంబంధించి రూ.275 కోట్లు మాత్రమే రైతుల ఖాతాల్లో జమ అయ్యాయి. ఇంకా రూ.390 కోట్లు రైతులకు చెల్లించాల్సి ఉంది. రైతులు సింగిల్ విండోల చుట్టూ రోజూ తిరుగుతూ డబ్బులు ఎప్పుడు జమ చేస్తారంటూ సిబ్బందిని ప్రతిరోజు అడుగుతున్నారు. ప్రభుత్వం స్పందించి ధాన్యం డబ్బులను చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

ఒక్క రూపాయి జమ కాలేదు



కాంటా వేసిన తర్వాత రెండు రోజుల్లో ధాన్యం డబ్బులు బ్యాంకు ఖాతాకు జమ చేస్తామని అధికారులు తెలిపారు. గత నెల 16న 28 క్వింటాళ్లు, 19న 46 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో విక్రయించాను. ఇప్పటికి రూపాయి కూడా రాలేదు.

– వలకొండ రవీందర్‌రెడ్డి, రైతు, అంతంపల్లి

హార్వెస్టర్ కిరాయి చెల్లించలేదు



వరి కోతలకు సంబంధించిన హార్వెస్టర్, ట్రాక్టర్లకు కిరాయి ఇంకా చెల్లించలేదు. విక్రయించిన ధాన్యం డబ్బులకు ఎదురు చూస్తున్నా. ప్రస్తుతం సాగు చేసేందుకు విత్తనాలు ఎలా కొనాలో అర్థం కావడం లేదు.

– ధ్యాగల నరేశ్, రైతు, భిక్కనూరు

వీసీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

- విద్యార్థుల జీవితాలతో ఆటలాడొద్దు
- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



డిచ్‌పల్లి బహుజన చైతన్య సభలో అభివాదం చేస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, జిల్లా నాయకులు

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): తెలంగాణ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ డి.రవీందర్‌గుప్తా అవినీతి, అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం సిట్టింగ్ జడ్జి ద్వారా విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఎస్ఎల్‌జీ గార్డెన్స్‌లో ఆదివారం నిర్వహించిన బహుజన చైతన్య సభకు అయన ముఖ్యఅతిథి హాజరై మాట్లాడారు. రిజిస్ట్రార్ పదవి అనేది వర్సిటీ అభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి అనుగుణంగా ఉండాలన్నారు. తెయూ వీసీ, ఈసీ రాజకీయాలతో విద్యార్థుల భవిష్యత్ అంధకారంగా మారిందని, విద్యార్థుల జీవితాలతో ఆటలాడుకోవద్దన్నారు. బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పల్లికొండ నర్సయ్య, గణేష్, గంగాధర్, ప్రవీణ్, శ్రీనివాస్, బాబురావు, ప్రసాద్, రణవీర్, ఉన్నారు.

ప్రభుత్వ భూములను పేదలకు పంచాలి

నిజామాబాద్ సిటీ: ప్రభుత్వ భూములను పేదలకు పంచాలని, ధాత్రి టౌన్‌షిప్ పేరుతో ప్రయివేటు వ్యక్తులకు అమ్మడం రాజ్యాంగ విరుద్ధమని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. నిజామాబాద్ రూరల్ మండలం మల్కాపూర్ గ్రామ శివారులో గల ప్రభుత్వ భూములను ఆదివారం ఆయన పేదలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఎస్పీ అధికారంలోకి వచ్చాక ఇలాంటి భూములను వెలికి తీసి పేదలకు పంచి పట్టాలు ఇచ్చి పూర్తిగా హక్కులు కల్పిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల గొంతు నొక్కి తెలంగాణ దశాబ్ది సంబురాలు చేసుకుంటుందని, ప్రజలు సంబురాలను బహిష్కరించాలని పిలుపునిచ్చారు. తమ పార్టీ అధికారంలోకి వస్తుందని పేద ప్రజల పక్షాన నిలబడుతుందని ఆయన తెలిపారు. నాయకులు శ్రీనివాస్, గ్రామస్తులున్నారు



మల్కాపూర్‌లో మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

మినరల్ కాదు.. కెమికల్ వాటర్..

- ప్యూరిఫై డ్రింకింగ్ వాటర్‌తో దోపిడీ
- విచ్చలవిడిగా వెలిసిన వాటర్ ప్లాంట్లు
- పర్యవేక్షణ చేయని అధికారులు



నగరంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్



ఆటోలో తరలిస్తున్న వాటర్ డబ్బాలు

నిజామాబాద్‌నాగారం: జిల్లాలోని చాలా చోట్ల ప్రజలు ఆరోగ్యం కోసం స్థానిక వాటర్ ప్లాంట్ల నుంచి మినరల్ వాటర్‌ను తెచ్చుకుంటున్నారు. కానీ నిర్వాహకులు మాత్రం మినరల్ వాటర్‌కు బదులు కెమికల్ కలిపిన వాటర్‌ను విక్రయిస్తూ, సొమ్ము చేసుకుంటున్నారు. అయినా అధికారులెవరూ పట్టించుకోవడం లేదు.

పుట్టగొడుగుల్లా..

జిల్లాలోని చాలా చోట్ల పుట్టగొడుగుల్లా మినరల్ వాటర్‌ప్లాంట్లు వెలిశాయి. నిజామాబాద్ మున్సిపాలిటీతో పాటు, బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్ పట్టణాల్లోనే వందలాది వాటర్ ప్లాంట్లు ఉన్నాయి. మండల కేంద్రాల్లో పదుల సంఖ్యలో, పల్లెలో రెండు నుంచి నాలుగు వరకు ప్లాంట్లు ఉన్నాయి. దాదాపు ఏ ప్లాంట్‌కు కూడా అనుమతి ఉండదు. జిల్లాలో ఐఎస్ఐ బ్రాండ్ గల వాటర్ ప్లాంట్లు కేవలం మూడు, నాలుగు మాత్రమే ఉన్నాయి. సుమారు 600లకు పైగా వాటర్‌ప్లాంట్లు ఐఎస్ఐ బ్రాండ్ లేకుండా వెలిశాయి. పేరుకే మినరల్ వాటర్ కానీ రుచి కోసం కెమికల్స్ కలిపి విక్రయిస్తున్నారు. 20లీటర్ల డబ్బ రూ. 15 నుంచి రూ.20 వరకు విక్రయిస్తున్నారు. కూలింగ్ వాటర్ అయితే రూ. 35నుంచి రూ. 45వరకు అమ్ముతున్నారు.

ప్రజల ఆరోగ్యంతో చెలగాటం..

పల్లెలో ఒకప్పుడు బావి, బోరుబావి నీళ్లు తాగేవారు. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేకుండా పోయింది. ప్రస్తుతం పల్లె, పట్టణ ప్రజలందరూ మినరల్ వాటర్‌కు అలవాటు అయ్యారు. దీంతో వ్యాపారులు ప్రజల ఆసరాను వ్యాపారంగా మార్చుకున్నారు. వ్యాపారులు ఐఎస్ఐ బ్రాండ్ ఉంటేనే నీటిని విక్రయించాలి. కానీ జిల్లాలో ఐఎస్ఐ బ్రాండ్‌లేకుండా అక్రమంగా నీటిని అమ్ముతున్నారు. దీంతో డబ్బులు పెట్టి మరీ ప్రజలు అనారోగ్యానికి కొనితెచ్చుకుంటున్నారు.

తనిఖీలు అంతంతే..

పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు ఎవరికివారు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా ఫుడ్ఇన్‌స్పెక్టర్ ఇప్పటి వరకు ఒక్క వాటర్‌ప్లాంట్‌ను కూడా తనిఖీ చేసిన దాఖలాలు లేవు. అలాగే భూగర్భ జలశాఖ, ఇండస్ట్రీస్, ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్, హెల్త్, జాయింట్ కలెక్టర్ పలు శాఖలకు సంబంధించి కమిటీ గతంలోఉండేది. ప్రస్తుతం కమిటీ ఉందో లేదో అని అంటున్నారు. కమిటీతోపాటు, సంబంధిత అధికారులు అక్రమ ప్లాంట్లవైపు కన్నెత్తి చూడక పోవడంతో మినరల్ వాటర్ పేరిట వ్యాపారం జోరుగా సాగుతోంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అక్రమాలకు పాల్పడుతున్న వాటర్‌ప్లాంట్లపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అధికారులు స్పందించాల్సిందే..

జిల్లాలో చాలా చోట్ల అక్రమంగా వాటర్ ప్లాంట్లు వెలిశాయి. ఇంక వెలుస్తునే ఉన్నాయి. కనీస నిబంధనలు పాటించకుండానే వాటర్‌ప్లాంట్లు ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతున్నాయి. సంబంధిత అధికారులతో పాటు, గతంలో కమిటీ ఉన్నా పర్యవేక్షణ చేయడం లేదు. ఎన్నో సార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లాను. ఎవరు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

–మాయవార్ రాజేశ్వర్, వినియోగదారుల ఫోరం చైర్మన్, నిజామాబాద్

నిత్యం మద్యం తాగి.. వేధిస్తున్నాడని..

- భర్తను హతమార్చిన భార్య!
- విచారణ చేపడుతున్న పోలీసులు..



హత్యకు గురైన రమేష్



రమేష్ (ఫైల్)

మోపాల్(నిజామాబాద్‌రూరల్): నిత్యం మద్యం తాగి వేధింపులకు పాల్పడుతున్నాడని భర్తను భార్య హత్య చేసింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని న్యాల్‌కల్ గ్రామానికి చెందిన కట్టకింది రమేష్(47), స్వరూప దంపతులు. వారికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నాడు. రమేష్ వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. నిత్యం రాత్రిపూట మద్యం తాగి భార్యతో గొడవకు దిగేవాడు. శనివారం రాత్రి కూడా అధికంగా మద్యం తాగి ఇంటికి వచ్చాడు. అనంతరం భార్యభర్తలు గొడవపడ్డారు. కొద్దిసేపటి తర్వాత రమేష్ నిద్రపోయాడు. దీంతో భార్య అతడి తలపై బండరాయితో మోదడంతో అక్కడికక్కడే మృతిచెందినట్లు పోలీసులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. సీఐ సురేందర్‌రెడ్డి, ఎస్‌ఐ మహేష్ చుట్టుపక్కల ఇళ్లల్లో వివరాలు సేకరించారు. భార్యభర్తల తీరుపై ఆరా తీశారు. డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీం సిబ్బంది ఆధారాలు సేకరించారు. స్వరూపకు ఎవరైనా సహకరించారా అన్న కోణంలో విచారణ చేపడుతున్నారు. గ్రామస్తుడు గంగారాం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు. మృతదేహాన్ని జిల్లాకేంద్ర ఆస్పత్రికి తరలించారు.

శైలేష్ మృతదేహం స్వగ్రామానికి చేర్చేలా ఏర్పాట్లు

భీమ్‌గల్: మండలంలోని బడా భీమ్‌గల్ గ్రామానికి చెందిన గుర్రపు శైలేష్ అమెరికాలోని న్యూజెర్సీలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కారులోనే సజీవ దహనమైన ఘటన తెలిసిందే.. కాగా మృతదేహాన్ని స్వగ్రామానికి చేర్చేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తున్నట్లు బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ సెల్ సమన్వయకర్త బిగాల గణేష్ ఆదివారం తెలిపారు. వీలైనంత త్వరగా మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అమెరికాలోని న్యూయార్క్ భారత కార్యాలయం నుంచి తెలంగాణ ఎన్ఆర్ఐ శాఖ లక్ష్మీదేవి, చిట్టిబాబులు సంప్రదింపులు జరుపుతున్నారన్నారు. అలాగే మంత్రి ప్రశాంత్ రెడ్డి సైతం పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఏం చేశారని దశాబ్ది ఉత్సవాలు!

- బీఆర్ఎస్‌కు సిగ్గుండాలి
- మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత షబ్బీర్‌అలీ



మాట్లాడుతున్న మాజీ మంత్రి షబ్బీర్ అలీ

కామారెడ్డి టౌన్: రాష్ట్రంలో రైతులకు, ప్రజలకు ఏం చేశారని దశాబ్ది ఉత్సవాలు జరుపుతున్నారని, బీఆర్ఎస్‌కు సిగ్గుండాలని మాజీ మంత్రి షబ్బీర్‌అలీ మండి పడ్డారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి యూత్ జోడో బూత్ జోడో శిక్షణ శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రభుత్వం ఇప్పటివరకు రైతు రుణమాఫీ చేయలేదని, దేశమే ఆగం అయ్యేలా ఉచిత ఎరువులు ఇస్తామని ఇచ్చిన హామీ, పంటలకు గిట్టుబాటు ధర ఇలా ఎన్నో హామీలు నీటిమూటలే అయ్యాయని కేసీఆర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో సీఎం పర్యటన చేసినప్పుడు సభలో చెప్పినట్లు మహిళ సంఘాల ద్వారా పసుపు, మక్క, ఎర్రజొన్న కొనుగోలు చేస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. జిల్లాలో స్పీకర్, మంత్రి, ఎమ్మెల్సీ కవిత రైతు దినోత్సవం సంబురాలు జరుపుతున్నారని, అసలు వారికి ఏం అర్హత ఉందని మండిపడ్డారు. మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా తీర్చిదిద్దారని అన్నారు. అవినీతి ప్రభుత్వాన్ని గద్దె దించి రైతు పక్షపాతి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువస్తేనే సమస్యలన్నీ తీరుతాయని అన్నారు. యూత్ కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి సయ్యద్ ఖలీద్ అహ్మద్, ఇలియాజ్ అలీ, ఐరెని సందీప్, ఇంద్రకరణ్‌రెడ్డి, గణేష్ నాయక్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

రెండు కార్లు ఢీ: నలుగురికి తీవ్ర గాయాలు



నారాయణఖేడ్: ఎదురెదురుగా వచ్చిన రెండు కార్లు ఢీకొనడంతో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన ఆదివారం నారాయణఖేడ్ పట్టణ శివారులోని నిజాంపేట్- నారాయణఖేడ్- బీదర్ 161బీ జాతీయ రహదారిపై జరిగింది. ప్రమాదంలో దెబ్బతిన్న ఓ కారులో కామారెడ్డి జిల్లా జుక్కల్‌కు చెందిన భార్యాభర్తలు సావిత్రి (33), దత్తాత్రిగౌడ్ (35) ఉండగా వారికి తీవ్ర గాయాలయ్యాయి. డ్రైవర్ శ్రీనివాస్‌కు స్వల్పగాయాలు తగిలాయి. మరో కారులో ప్రయాణిస్తున్న సదాశివనగర్ మండలానికి చెందిన రాములు (40), సంజీవ్ (40) గాయపడ్డారు. అలాగే మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వారిని 108 అంబులెన్స్‌లో నారాయణఖేడ్ ఏరియా ఆస్పత్రికి తీసుకురాగా ప్రథమ చికిత్స చేశారు. మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్‌కు తరలించారు.

విద్యుత్ షాక్‌తో ఒక్కరికి..

భిక్కనూరు: మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో ఆదివారం విద్యుత్ షాక్‌తో ఒక్కరికి తీవ్ర గాయాలు అయ్యాయి. వివరాలు ఇలా.. మండలంలోని జంగంపల్లి గ్రామానికి చెందిన బొమ్మని పెద్ద పోచయ్య స్లాబ్‌లు వేసే కార్మికుడిగా పనిచేస్తున్నాడు. తిప్పాపూర్ గ్రామంలో స్లాబ్ వేసేందుకు కార్మికుడిగా వెళ్లాడు. అక్కడ స్లాబ్ పైకి ఎక్కగా అక్కడ ఉన్న విద్యుత్ తీగలను తాకడంతో విద్యుత్ షాక్‌కు గురై కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే పోచయ్యను చికిత్స నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య

బిచ్కుంద: మండలంలోని సీతారాంపల్లి గ్రామానికి చెందిన పోషబోయి(38) ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నట్లు బిచ్కుంద ఎస్సై శ్రీధర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. గత కొన్ని రోజులుగా మృతుడికి చేయడానికి పని దొరకకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పెరిగిపోయాయి. ఈక్రమంలో శనివారం సాయంత్రం తన పొలంలోని వేపచెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య కర్రల లక్ష్మి ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

జీవితంపై విరక్తి చెంది వృద్ధుడు..

ఖలీల్‌వాడి: తాగుడుకు బానిసై, జీవితంపై విరక్తి చెందిన ఓ వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆరో టౌన్ ఎస్సై సాయికుమార్‌గౌడ్ ఆదివారం తెలిపారు. వివరాలు ఇలా.. నగరంలోని దుబ్బ ప్రాంతానికి చెందిన దశరథ్(63) తాగుడుకు బానిసై, ఒంటరిగా జీవిస్తూ, నగరంలో తిరుగుతుండేవాడు. ఎలాంటి పని చేసేవాడు కాదు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఈనెల 2న దశరథ్ ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అశోక్ సాగర్‌లో పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి అన్న ప్రభాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

‘ఉపాధి’ ఉద్యోగులకు పేస్కేల్ ప్రకటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఉపాధి ఉద్యోగ జేఏసీ చైర్మన్ కృష్ణాగౌడ్

కామారెడ్డి రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న 3874 మంది ఉద్యోగులకు వెంటనే పేస్కేలు ప్రకటించాలని జిల్లా ఉపాధిహామీ ఉద్యోగుల ఐక్య కార్యచరణ కమిటీ చైర్మన్ సరంపల్లి కృష్ణాగౌడ్ కోరారు. జిల్లా కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏపీవోలు, ఏసీలు, సాంకేతిక సహాయకులు, కంప్యూటర్ ఆపరేటర్లు, అకౌంటెంట్లు, ప్లాంటేషన్ సూపర్‌వైజర్లు, అడిషనల్ డీఆర్పీలు, హెచ్ఆర్ మేనేజర్లు, డీబీటీలు, ఇలా 3874 మంది ఉద్యోగులు పేస్కేల్ కోసం ఎదురు చూస్తున్నారన్నారు. గ్రామీణాభివృద్ధిశాఖలో రెండు కళ్లలాంటి సెర్ప్, ఉపాధిహామీ విభాగాలలో సెర్ప్ ఉద్యోగులకు పేస్కేల్ ప్రకటించిన ప్రభుత్వం ఉపాధి హామీ ఉద్యోగులకు మొండి చేయి చూపిందన్నారు. దశాబ్ది ఉత్సవాలు పూర్తయ్యేసరికి ఉపాధిహామీ ఉద్యోగులకు తీపి కబురు అందించాలని కోరారు. కరోనా కాలంలో ఎంతో మంది ఉపాధి హామీ ఉద్యోగులు అమరులైనారని వారి ఆత్మశాంతి కోసమైన ఉపాధిహామీ ఉద్యోగులకు పేస్కేలు ప్రకటించి ఉద్యోగుల జీవితాలలో వెలుగులు నింపాలన్నారు. ఉద్యోగులు మనోహర్, వినోద్‌కుమార్, వంశీకృష్ణ పాల్గొన్నారు.

ఇల్లు దగ్ధం

ఎల్లారెడ్డి: పట్టణంలోని జోషి శ్రీధర్‌కు చెందిన ఇంటిలో ఆదివారం షార్ట్ సర్క్యూట్ జరగడంతో ఇల్లు దగ్ధమైనట్లు స్థానికులు తెలిపారు. దీంతో ఇంట్లోని వస్తువులన్నీ కాలి బూడిదైనట్లు వారు తెలిపారు. ప్రమాదంలో పది తులాల బంగారం, రెండు లక్షల నగదుతో పాటు బట్టలు, ఇంటిలోని సామగ్రి కాలిపోయినట్లు బాధితుడు తెలిపారు. ఘటన స్థలాన్ని గిర్దావార్ శ్రీనివాస్ పంచనామా నిర్వహించారు.